సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 17 । జనవరి । 2025



సంచారం..

సంచార జాతుల సంప్రదాయాలు విభిన్నమైనవి. వాటిని తూచా తప్పకుండా పాటిస్తారు. - 8లో



వేటకు వెళ్లి..

బందరువానిపేట తీరంలో ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. కుటుంబం శోకసంద్రమైంది. - 8లో

నేడు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమాన్ని జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత పేర్కొన్నారు.

న్యూస్‌రీల్‌

కేసు విచారణలపై దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: జైలులో ఖైదీల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లాలో గల జైలు ముద్దాయిలకు చార్జిషీట్‌లు వేసి వారికి త్వరితగతిన వారికి న్యాయం చేకూర్చడానికి పోలీసు యంత్రాంగం, న్యాయవాదులు పని చేయాలని ఆదేశాలు ఇచ్చారు. గురువారం కోర్టు హాల్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జైలు ముద్దాయిల కేసుల విచారణపై పలు సూచనలు చేశారు. స్టేటటరీ కమిటీ 2023 – 2024 కు సంబంధించిన వార్షిక ఆదాయాల ఖర్చుల గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్, కేవీఎల్ హిమబిందు, కార్యదర్శి, ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం దృష్టికి ఇచ్ఛాపురం రైలు నిలయం సమస్యలు



రైల్వే సమస్యలపై వినతి పత్రం అందజేస్తున్న డిఆర్‌యూసీమెంబర్ కట్టా సూర్యప్రకాష్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలునిలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఖుర్దాడివిజన్ డీఆర్‌ఎం హెచ్‌ఎస్ బజ్వా దృష్టికి డిఆర్‌యూసీమెంబర్ కట్టా సూర్యప్రకాష్ తీసుకెళ్లారు. గురువారం ఖుర్దారైల్వే డివిజన్ కార్యాలయంలో డీఆర్‌ఎంని డీఆర్‌యూసీ మెంబర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం రైల్వేనిలయంలో నిర్మాణం చేయనున్న ఫుట్‌పాత్ వంతెనను పడమర వైపు పొడిగించాలని, రైల్వేస్టేషన్‌కి పడమర వైపు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, బాహుదానది పాతాల సిద్ధేశ్వరాలయం వద్ద గల ఉత్తరాయణంనకు వెళ్లేందుకు అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని, విశాఖ ఎక్స్‌ప్రెస్‌ని లింగంపల్లి వరకు పొడిగించేలా చర్యలు తీసుకోవాలని, సమీప రైల్వే స్టేషన్లు జాడుపూడి, బారువ స్టేషన్‌లో విశాఖ పాసింజర్ రైలుని నిలుపుదల చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగా డీఓఎం సునీల్‌కుమార్, డీసీఎం నాయక్‌గిరీష్‌లను కూడా కలిశారు.

సరిహద్దులో వాహనాల తనిఖీ



పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద ప్రైవేటు బస్సులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఒడిశా నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఒడిశా నుంచి గంజాయి, మత్తు పదార్థాలు రాకుండా అడ్డుకట్ట వేయనున్నట్లు ఏఎస్‌ఐ సింహాచలం తెలిపారు. ఒడిశా నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులతో పాటు కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు.

పరీక్షలకు సిద్ధమా..?



- ముంచుకు వస్తున్న టెన్త్‌, ఇంటర్ పరీక్షలు
- మార్చి ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం
- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు మొదలు
- రివిజన్ చేసే పనిలో నిమగ్నమైన గురువులు



పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఇంటర్మీడియెట్ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పండగ ముగిసింది. విద్యార్థులకు ఇక అసలైన పరీక్ష కాలం మొదలైంది. విద్యార్థి జీవితంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ అతి కీలకమైన పరీక్షలు. ఈ రెండు పరీక్షలకు సమయం సమీపిస్తోంది. ఇప్పటికే ఈ పరీక్షలకు షెడ్యూల్ ఖరారు కావడంతో విద్యార్థులు సంసిద్ధంగా ఉన్నారు.

మొదలైన పరీక్షల ఫీవర్..

జిల్లాలో చదువుతున్న టెన్త్‌, ఇంటర్మీడియెట్ విద్యార్థుల్లో పరీక్షల ఫీవర్ మొదలైంది. ఇంటర్ పరీక్షలకు ఇంకా 45రోజులు, టెన్త్ పరీక్షలకు 60రోజులు మాత్రమే వ్యవధి ఉంది. ఇప్పటికే పాఠశాల విద్య, ఇంటర్మీడియెట్ అధికారులు.. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసే దిశగా పలు కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. రోజువారీ స్లిప్ టెస్టులు, వారాంతపు పరీక్షలు, 100 రోజుల ప్రణాళిక, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా ఫోకస్, టాపర్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించి సానబెడుతున్నారు. సకాలంలో సిలబస్‌లను పూర్తిచేయడంతోపాటు రివిజన్‌లు చేసే పనిలో ఉపాధ్యాయులు, లెక్చరర్లు నిమగ్నమై ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు 40,856 మంది..

2024 మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదలుకానున్నాయి. ఇంటర్ బోర్డు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి ఒకటి నుంచి పరీక్షలు మొదలై.. 20వ తేదీతో ముగుస్తాయి. కాగా ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, ఫిబ్రవరి 3వ తేదీన ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పేరిట తప్పనిసరి పరీక్షలు జరగనున్నాయి. ఈ రెండు పరీక్షలను ఆయా కళాశాలల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. ప్రీపబ్లిక్ పరీక్షలను జనవరి 20 నుంచి నిర్వహించనున్నారు. అలాగే ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో ఫంక్షనింగ్ జరుగుతున్న కళాశాలలు 164 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, సోషల్ వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 1, మోడల్ స్కూల్/కళాశాలలు 13, కేజీబీవీలు 25, హైస్కూల్ ప్లస్ కాలేజీలు 6, ఎంజేఏపీజేసీ 1 కోపరేటివ్ 2, ప్రైవేటు కళాశాలలు 69 ఉన్నాయి. వీటిల్లో 40,856 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షకు ఫీజులు చెల్లించారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 20,702 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20,154 మంది ఫీజులను చెల్లించారు. వీరంతా పరీక్షలకు హాజరు కానున్నారు.



ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా కార్యాలయం

టెన్త్ పరీక్షలకు 28,938 మంది..

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి మొదలుకానున్నాయి. ఈ పరీక్షలు రోజు విడిచి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. 2023 మార్చిలో రోజు విడిచి రోజు నిర్వహించగా.. 2024 మార్చిలో మాత్రం వరుసగా పరీక్షలను నిర్వహించారు. ఈ ఏడాది మళ్లీ రోజు విడిచి రోజు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం మార్చి 31వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ఇదిలా ఉండగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు శ్రీకాకుళం జిల్లా నుంచి 590 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 28,938 మంది విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 27,690 మంది, ప్రైవేటు విద్యార్థులు (గతంలో ఫెయిలైనవారు) 1248 మంది ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా..



మా పాఠశాలలో 76 మంది చదువుతున్నారు. వారికి ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. డెయిలీ టెస్టులను, వారాంతపు టెస్టులను తయారు చేస్తున్నాం. విద్యాశాఖ ప్రకటించిన 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. పాత ప్రశ్న పత్రాలు, మోడల్ పేపర్స్‌తో పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. – ఎ.వెంకటమురళీకృష్ణ, హెచ్‌ఎం, బలగ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్

సిలబస్‌లను త్వరితగతిన పూర్తిచేయాలి



ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు 2024 మార్చి ఒకటి నుంచి జరగనున్నాయి. షెడ్యూల్ వెలువడింది. పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో 40,856 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. వీరంతా ఫీజులు చెల్లించారు. అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల్లో సిలబస్‌లను త్వరితగతిన పూర్తిచేసి, రివిజన్‌లు చేపించాలి. ప్రాక్టికల్స్‌కు సిద్ధం చేయాలి. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా ఫోకస్ చేసి, వారంతా ఉత్తీర్ణులయ్యేలా చేయాలి. – ప్రగడ దుర్గారావు, జిల్లా ఆర్ఐఓ, ఇంటర్మీడియెట్ బోర్డు శ్రీకాకుళం

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి..



కళాశాలలో ఇంటర్మీడియెట్ 518 మంది చదువుతున్నారు. వీరంతా మార్చి 1 నుంచి జరిగే పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను సమాయత్తం చేస్తున్నాం. అలాగే ప్రాక్టికల్స్‌కు 90 మంది సన్నద్ధమవుతున్నారు. వెనుకబబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నాం. రివిజన్‌లు చేయిస్తున్నాం. ప్రాక్టికల్స్ కోసం తీర్చిదిద్దుతున్నాం. – బొమ్మలాట శ్యామ్‌సుందర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆమదాలవలస

విద్యార్థులను సిద్ధం చేయాలి



2024 మార్చి 17 నుంచి పదోతరగతి విద్యార్థుల పరీక్షలు మొదలుకానున్నాయి. ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. పరీక్షలకోసం అన్ని యాజమాన్యాల పరిధిలో 28,938 మంది ఫీజులు చెల్లించారు. వీరంతా పరీక్షలకు సమాయత్తమవుతున్నారు. గత నాలుగేళ్ల నుంచి రాష్ట్రంలో మొదటి మూడు స్థానాల్లో నిలుస్తున్నాం. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలి. – డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

తుది రాత పరీక్షకు 317 మంది ఎంపిక



లాంగ్ జంప్

ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో దేహదారుఢ్య పరీక్షలు ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు గత నెల 30 నుంచి నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సెలవులు అనంతరం గురువారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎంపికకు గురువారం 727 మంది హాజరు కావాల్సి ఉండగా, 478 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో తుది రాత పరీక్షకు 317 మంది అర్హత సాధించారు. అభ్యర్థులకు క్రమ పద్ధతిలో ఎత్తు పరిశీలన, ఛాతీ కొలత, 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ నిర్వహించి, అర్హత సాధించిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ నెల 18వ తేదీతో ఎంపిక ప్రక్రియ ముగియనుంది. తుది రాత పరీక్ష తేదీ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఎంపిక ప్రక్రియను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

–ఎచ్చెర్ల క్యాంపస్



అభ్యర్థి ఎత్తు పరిశీలిస్తున్న దృశ్యం



1600మీటర్ల పరుగుపందెంలో అభ్యర్థులు

ఆలోచన మారింది.. ఆదాయం పెరిగింది!

- బంతి పూల సాగుతో అదనపు ఆదాయం
- బీడు నేలలో బంతిపూల వికాసం

ఎల్‌.ఎన్‌.పేట: ఖరీఫ్ వరిచేను కోత కోసిన తర్వాత రైతులు ఏదో ఒక పంటను సాగు చేస్తారు. ఎక్కువగా అపరాలు, మొక్క జొన్న, నువ్వు, వేసవి వరి వంటి పంటలు పండిస్తారు. అదే పంట ఏటా పండించటం, దళారులు అడిగిన ధరకు అమ్ముకోవటం వల్ల పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడుతుంది. మూడు, నాలుగు నెలల తర్వాత ఎప్పుడో పంట చేతికి అందివచ్చినప్పుడు అమ్ముకునే కంటే మార్కెట్‌లో నిత్యం గిరాకీ ఉన్న పంటలను పండిస్తే నచ్చిన ధరకు అమ్ముకోవచ్చని భావించారు. పంట దిగుబడులను ప్రతి రోజూ అమ్ముకుంటూ రోజూ ఆదాయం పొందాలని భావించారు. ఆలోచన మారడంతో వారికి అదనపు ఆదాయం పెరిగింది. మండలంలోని తురకపేట, పూశాం, చొర్లంగి, లక్ష్మీనర్సుపేట గ్రామాలకు చెందిన కొందరు రైతులు బంతి పువ్వులు, కూరగాయల పంటలను పండిస్తూ ఆదాయం పొందుతున్నారు.

మార్కెట్ సదుపాయం లేక

పువ్వులు, కూరగాయలు పండించిన రైతులకు మార్కెట్ సదుపాయం లేక పంట దిగుబడులు అమ్మేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పంట కొనేందుకు వ్యాపారులు రైతుల వద్దకు రావటం లేదు. దీంతో రైతులే పంట తీసుకుని వ్యాపారుల వద్దకు అమ్మేందుకు వెళుతున్నారు. ధర బాగా ఉన్నప్పటికీ తీసుకుని వెళ్లేందుకు రవాణా పరంగా రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మార్కెట్ సదుపాయం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

రోజూ దిగుబడి.. ఆదాయం

పూలు, కూరగాయలు వారంలో మూడు, నాలుగు సార్లు కోతకు వస్తున్నాయి. వీటిని అమ్మటంతో వారంలో నాలుగు సార్లు రైతన్న చేతికి ఆదాయం అందుతుంది. ఒకసారి కోతకు వచ్చిన తర్వాత నీటి తడులు పెట్టి అవసరం మేరకు ఎరువులు వేసుకుంటే సుమారు మూడు నెలల వరకు పంట చేతికి అందుతూనే ఉంటుందని రైతులు చెబుతున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం కూడా వస్తుంది.



పూశాం వద్ద కన్నుల పండుగలా బంతి సాగు

బంతిపూల సాగుతో ఆదాయం



మండలంలోని పూశాం, చొర్లంగి గ్రామాలకు చెందిన శివ్వాల సుదర్శనరావు ఎకరా పొలంలో ఈ ఏడాది ఎరుపు, పసుపు రంగుల బంతి మొక్కలు వేశారు. బంతి పూలకు మార్కెట్‌లో ఈ ఏడాది ధర తగ్గినప్పటికీ తన పెట్టుబడికి తగిన ఆదాయం వచ్చింది. బెంగళూరు నుంచి విత్తనం తెప్పించి సీతంపేటలో నారు సిద్ధం చేయించాం. బంతి పూలు కిలో రూ.100ల వరకు విక్రయించాం. పువ్వులు అమ్ముకునేందుకు ఈ ప్రాంతంలో సరైన మార్కెట్ సదుపాయం లేక కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. – శివ్వాల సుదర్శనరావు, రైతు, పూశాం, ఎల్ఎన్ పేట

రకరకాల కూరగాయల సాగు



పొలాన్ని మెత్తగా దుక్కి చేసిన తర్వాత బాగా కుళ్లిన గత్తం వేసి మరోసారి నీటి తడిపెట్టి పొలాన్ని మెత్తగా దుక్కి చేసి కూరగాయల విత్తనాలు వేసేందుకు అనువుగా చిన్నచిన్న బోదుల్లా (గట్టుల్లా) వేసుకుని నీటి తడి పెట్టిన తరువాత పొలంలో బెండ విత్తనాలు వేసుకున్నాం. ఎరువులు, పురుగుల మందులు తక్కువగా వినియోగిస్తూ పంట పండిస్తున్నాం. ప్రస్తుతం వారంలో మూడు సార్లు బెండ కోతకు వస్తుంది. బీర, మరోవైపు పొడవు చిక్కుడు, గట్టుల చుట్టూ ఆనప వేశాం. మరికొన్ని రోజులు ఆగితే మిగిలిన పంటలు కోతకు వస్తాయి. – పైడి దాసు, రైతు, తురకపేట, ఎల్.ఎన్.పేట

రహదారి భద్రత వారోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ దేవదానం

శ్రీకాకుళం అర్బన్‌: కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం శ్రీకాకుళం 1వ డిపో గ్యారేజ్ ఆవరణలో ప్రారంభోత్సవ సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాకుళం పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ దేవదానం హాజరై మాట్లాడారు. రహదారిపై భారీ వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రత ప్రధానమని, భద్రతతో కూడిన ప్రయాణ సౌకర్యాన్ని ప్రయాణికులకు కల్పించాలని కోరారు. 1వ డిపో మేనేజర్ అమరసింహుడు మాట్లాడుతూ ప్రమాద రహిత, సుఖవంతమైన సురక్షితమైన ప్రయాణాన్ని ప్రయాణికులకు అందించడం ద్వారా వారి మన్ననలు పొందాలని కోరారు. కార్యక్రమంలో రెండో డిపో మేనేజర్ శర్మ, 1,2 డిపోల సహాయ మేనేజర్లు రమేష్, గంగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఎస్.నాయుడు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్లు భాస్కరరావు, మూర్తి, అసోసియేషన్ ప్రతినిధులు, భద్రత, నిఘావిభాగం ప్రతినిధుల డ్రైవర్లు, మెకానిక్‌లు, పీఆర్ఓ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో కొండచిలువ సంచారం



వజ్రపుకొత్తూరు రూరల్‌: వనాల్లో ఉండాల్సిన వన్య ప్రాణులు జనాల మధ్య సంచరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మండలంలో గల బెండి గేటు, బెండి, సీతాపురం, గల్లి, తాడివాడ, మహాదేవపురం, కొండపూరు ప్రాంతాల్లో కొండ చిలువలు సంచరిస్తున్నాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో రోడ్లపై తిరుగుతుండడంతో జనం భయపడుతున్నారు. ఇటీవల బెండి గేటు– బెండి ఆర్‌అండ్‌బి రోడ్డుపై అడ్డంగా ఉన్న కొండ చిలువను తప్పించే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. గతంలో కూడా ఇలాంటి ప్రమాదాలు అనేకం జరిగాయని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు.

కోలాహలంగా హలాహలేశ్వరుని యాత్ర



శ్రీరాంపాడులోని హలాహలేశ్వర యాత్రకు భక్తులు పోటెత్తారు. వేలాది మంది మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. రెడ్డికిపేట–అంపలాం మధ్య బసివలస రోడ్డుకు ఆనుకుని ఉన్న మల్లికార్జున స్వామి శివాలయ ప్రాంగణంలో ఏటా మాదిరిగానే గురువారం యాత్ర జరిగింది. సాయంత్రం రెండు గంటల నుంచే భక్తులు రాక ప్రారంభం కాగా సాయంత్రం ఐదు గంటల సరికి భక్తులు అధికంగా తరలిరావడంతో యాత్ర ప్రాంగణం అంతా కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం ఉచితంగా పంపిణీ చేశారు. కంబకాయలో కూడా స్వయంభువేశ్వరా ఆలయం 75 వార్షికోత్సవం సందర్భంగా గ్రామ ప్రధాన కూడలిలో యాత్ర నిర్వహించారు. వందలాది మంది యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

–నరసన్నపేట

తీరానికి పండగ

టెక్కలి డివిజన్‌లోని ప్రధాన బీచ్‌లు పండగ వేళ కిటకిటలాడాయి. సంక్రాంతిని పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ఇటు పలాస నుంచి అక్కుపల్లి శివసాగర్ బీచ్‌కు అటు టెక్కలి నుంచి భావనపాడు బీచ్‌లకు పోటెత్తారు. దీంతో తీరం జనసంద్రమైంది.

–వజ్రపుకొత్తూరు



సంగమేశా శరణు శరణు..



మండలంలోని గాజులకొల్లివలస వద్ద గల సంగమేశ్వర స్వామి జాతర గురువారంతో ముగిసింది. జాతర ఆఖరి రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి విజయనగరం విశాఖపట్టణం నుంచి జాతరకు భారీ ఎత్తున యాత్రికులు తరలి వచ్చారు. చిన్నా పెద్దా తేడా లేకుండా జాతరలో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. జాతరకు యాత్రికులు పోటెత్తడంతో అలికాం బత్తిలి ప్రధాన రహదారి నుంచి సంగమేశ్వర స్వామి కొండ దిగువన జరిగే జాతర వద్దకు చేరుకునేందుకు యాత్రికులకు చాలా సమయం పట్టింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొంతమంది ఆకతాయిలు ద్విచక్ర వాహనాలతో జాతర వద్దకు వివిధ మార్గాలలో రావడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చీకటి పడినప్పటికీ జాతరకు యాత్రికుల రాక తగ్గ లేదు. జాతర ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

–ఆమదాలవలస

క్లుప్తంగా

నాటు సారాతో వ్యక్తి అరెస్టు

పలాస: పలాస మండలం సవర రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సవర సోమేశ్వరరావును గురువారం కాశీబుగ్గ ఎక్సైజ్‌పోలీసులు అరెస్టు చేశారు. అతను వద్ద నుంచి 4లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అనంతరం రిమాండుకు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు మల్లికార్జునరావు ఈ విషయం చెప్పారు.

మిల్లు హెల్పర్ ఆత్మహత్య

గార: వాడాడ పరిధిలోని జొన్నలపాడు వద్ద నున్న ఓ రైసు మిల్లులో గురువారం బీహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన వికాస్ కుమార్ (20) ఊక గోడౌన్ గోడ స్తంభాలకు ఉరి వేసుకున్నాడు. తోటి మిల్లు ఆపరేటర్ గమనించి యజమానికి సమాచారం అందించాడు. పోలీసులు, క్లూస్‌టీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడు వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రాథమికంగా గుర్తించామని, మరో ఆపరేటర్ సుకేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ ఎం.చిరంజీవిరావు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి ఆర్మీ ఉద్యోగుల విరాళం



ధనుపురంలో సర్పంచ్ ఢిల్లేశ్వరరావుకు నగదును అందజేస్తున్న ఆర్మీ ఉద్యోగులు

హిరమండలం: మండలంలోని ధనుపురం గ్రామంలో శ్రీ చెవిటమ్మతల్లి (గ్రామదేవత)ఆలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగులందరూ కలిసి రూ. లక్షా 50 వేలు ఆర్థిక సాయం చేశారు. గురువారం గ్రామ సర్పంచ్ దారపు ఢిల్లేశ్వరరావుకు, గ్రామ పెద్దల సమక్షంలో నగదును ఆర్మీ ఉద్యోగులు అందజేశారు. ఆర్మీ ఉద్యోగులను గ్రామస్తులు అభినందించారు.

కొత్తమ్మ తల్లికి బంగారు కానుకలు



కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారికి బంగారు కానుకలు అందజేస్తున్న దాతలు

టెక్కలి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారికి దాతలు సుమారు లక్ష రూపాయల విలువైన బంగారు కానుకలను గురువారం అందజేశారు. కొత్తమ్మతల్లి అమ్మవారికి విశాఖపట్టణానికి చెందిన పిన్నింటి లిఖిత ఈ బంగారు కానుకలను అందజేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి వి.రాధాకృష్ణకు వీటిని అందజేశారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు కింద పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పాతపట్నం: పాతపట్నం మండలంలోని చిన్నలోగిడి గ్రామ సమీపంలో పూరి నుంచి గుణుపూర్ వస్తున్న రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని స్థానికులు తెలిపారు. పెద్దలోగిడి రైల్వే గేటు చిన్నలోగిడి తరణి ఆలయం మధ్యలో గురువారం రాత్రి 7.30గంటలకు పూరి నుంచి గుణుపూర్ వస్తున్న రైలు కింద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల ఉంటుంది. బ్లూ, బ్లాక్ టీ షర్ట్ నైట్ ప్యాంట్‌తో ఉన్నాడు. పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తి కాదని చిన్నలోగిడి గ్రామస్తులు చెబుతున్నారు. రైలు సుమారు 15 నిమిషాలు నిలిపివేయడం జరిగిందన్నారు.

వైద్యం పొందుతూ వ్యక్తి మృతి

కొత్తూరు: కొత్తూరుకు చెందిన సిల్లా చక్రవర్తి బుధవారం బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన రాగోలులోని జెమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎండీ ఆమీర్ ఆలీ తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పంచనామా, పోస్టుమార్టం చేసిన అనంతరం గురువారం మృతదేహాన్ని గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

- విభిన్న జీవన శైలి వీరి సొంతం
- పెద్దల మాటే వేదవాక్కు
- ఏడాదికి ఒకసారి సమావేశం
- అనాదిగా సంప్రదాయాలు పాటిస్తున్న సంచార జాతులు

సంచారం ఆచారాలకు సత్కారం

ఇటీవల జరిగిన సమావేశంలో వలయాకారంలో కూర్చున్న కుల పెద్దలు



జలుమూరు:

వారికి ఓ శాశ్వత చిరునామా అంటూ ఉండదు. తిరిగే ఊళ్లన్నీ వారివే. ఊరువాడా తిరుగుతూ బతుకుతుంటారు. చిన్న చిన్న ఆటవస్తువులు,బొమ్మలు విక్రయిస్తూ కొందరు, అనాదిగా వస్తున్న వైద్య చిట్కాలతో తయారు చేసిన ఔషధాలు అమ్ముకుంటూ మరి కొందరు, గంగిరెడ్లను ఊరూరా తిప్పుతూ ఇంకొందరూ జీవిస్తారు. కానీ వీరు పాటించే నియమనిబంధనలు తెలిస్తే ఆశ్చర్యం కలగకమానదు. చెట్టుకో పుట్టగా తిరిగినా తాతముత్తాతలు ఏర్పరిచిన నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తారు.

ఏటా జనవరిలో నిర్వహిస్తాం..



ప్రతి ఏడాది జనవరి నెలలో ఈ సమావేశాలు నిర్వహిస్తాం. సుమారు పది తెగల వారం ఇందులో వందల సంఖ్యలో పాల్గొంటాం. గడిచిన ఏడాది వివాదాలు, మా సంప్రదాయాలు, ఆచారాలు ఈ సమావేశంలో చర్చించి పరిష్కరించుకుంటాం. ప్రధానంగా కుల వివాహాలను గౌరవించి మా జాతుల వారినే వివాహం చేసుకుంటాము. అలాగే ఒక్కో సమావేశం ఒక్కో చోట నిర్వహిస్తాం.

– నరసింహ,
టెక్కలి సంచార జాతి కుల పెద్ద

ఒక్కో తప్పునకు ఒక్కో ముడి..

ఏటా క్రమం తప్పకుండా ఒక సమావేశం నిర్వహించుకోవడం వీరికి తప్పనిసరి. ఆ సమావేశాల్లో ఆయా కుటుంబాల్లో తప్పు చేసిన వారికి జరిమానా రూపంలో శిక్షలు కూడా విధిస్తారు. ఈ తప్పులు నిర్ణయించడానికి 'దవళ' వస్త్రాన్ని ఈ కుల పెద్దలు వినియోగిస్తుంటారు. ఒక్కో తప్పునకు ఒక్కో ముడి వెయ్యడం ద్వారా తప్పుల సంఖ్యను నిర్ణయించి తదనుగుణంగా తీర్పునిస్తారు. జిల్లాలోని చెంచులు, గంగిరెడ్లు, జంగాలు, మల్లికార్జునులు, హరిదాసులు, మతియాలు ఇతర సంచార తెగలకు చెందిన సనాతన సంప్రదాయమిది. ఈ ఏడాది ఈ సమావేశాలను జలుమూరు మండలం తిలారు జంక్షన్, చిన్న దూగాం గ్రామాల మధ్య ఓ మామిడి తోటలో ఇటీవలే నిర్వహించారు.

పెద్దల సమక్షంలో సమస్య పరిష్కారం



మా తెగలో ఏదైనా వివాదాలు జరిగితే మా కుల పెద్దల సమక్షంలో పరిష్కరించుకుంటాం. మాట వరుసకైనా పోలీస్‌స్టేషన్, కోర్టులకు వెళ్లాం. ఎంతటి సమస్య అయినా మాలో మేము పరిష్కారం చేసుకుంటాము.

– పి.అప్పన్న, గండిరెడ్లు కుల పెద్ద, చిన్నదూగాం

మద్యం తాగి వస్తే జరిమానా..



ఈ సమావేశాలకు హాజరయ్యే వారు కొన్ని నియమాలు పాటించడం తప్పనిసరి. ముఖ్యంగా మద్యం సేవించి వస్తే సమావేశ పెద్ద అక్కడికక్కడే మూడు వందల నుంచి ఐదు వందల వరకు తప్పు తీవ్రతను బట్టి జరిమానా వేస్తారు. సమావేశ ప్రాంగణానికి, ఆవరణలోకి చెప్పులతో రావడం కూడా నిషేధం. సమావేశానికి హాజరయ్యే సంఖ్యను బట్టి వలయాకారం, బంతి భోజన ఆకారంలో కూర్చునే సమావేశ పెద్ద చెప్పే మాటలను శ్రద్ధగా వినాలి. వారి ఆజ్ఞలను శిరసా వహించాలి, ఆచరించాలి. తప్పు చేసిన వారిపై వాదోపవాదాలు జరుగుతుంటాయి. అన్ని వాదనలు విన్న తర్వాత సమావేశ పెద్ద (ఆ కులం పెద్ద) తీర్పు చెబుతాడు. అక్కడికక్కడే జరిమానా విధించి శిక్షను ఖరారు చేస్తారు.

ఎన్నెన్నో సంప్రదాయాలు..



ఈ సంచార జాతుల వారు అనాదిగా వస్తున్న తమ సంప్రదాయాన్ని తూ.చా తప్పకుండా పాటిస్తారు. కట్న కానుకలు పైసా తీసుకోకుండా, ఇవ్వకుండా వివాహాలు చేసుకోవడం వీరి సంప్రదాయాల్లో ఒకటి. ఈ జాతుల్లో వేరే జాతి వారిని పెళ్లి చేసుకున్నా ఆ జంటను శాశ్వతంగా తమ నుంచి బహిష్కరిస్తారు. వడ్డీ వ్యాపారం చేయడం వీరి దృష్టిలో పెద్ద నేరం. అప్పు చేసి తీర్చని పక్షంలో సదరు విషయం వారి దృష్టికి వచ్చి నిజమని తెలిస్తే.. తీసుకున్న డబ్బులకు రెండింతలు వసూలు చేసి కుల పెద్దలే ఆ అప్పు తీరుస్తారు. న్యాయస్థానాలు, పోలీస్‌స్టేషన్లకు వీరు వెళ్లే పనే లేదు. ఒక వేళ వెళ్లినా వీరి దృష్టిలో పెద్ద తప్పు. ఎంతటి వివాదమైనా తమ మధ్య పరిష్కరించుకుంటారే తప్ప కోర్టులకు వెళ్లరు. కుల పెద్దలు ఇచ్చే తీర్పును వేదవాక్కుగా భావించి శిరసా వహించడం గమనార్హం.

వీజీకే మూర్తికి ఘనంగా నివాళి



వి.జి.కె మూర్తి (ఫైల్)

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీఐటీయూ శ్రీకాకుళం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు వీజీకే మూర్తి మృతి కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి తెలిపారు. శ్రీకాకుళంలో గురువారం గుండెపోటుతో చనిపోయిన వీజీకే మూర్తి పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. ఆయన ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తూ వచ్చిన వేతనంలో చాలా వరకు ప్రజా ఉద్యమాలకు ఖర్చు చేశారని తెలిపారు. 1997లో పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో శ్యాంక్రగ్ పిస్టన్స్-రింగ్స్ లిమిటెడ్ పరిశ్రమలో సీఐటీయూ అనుబంధ యూనియన్ ఏర్పాటు చేయడానికి, తర్వాత 8 నెలలు పాటు కార్మికులతో సుదీర్ఘ సమ్మె నడిపించడంలో మూర్తి కృషి ఎనలేనిదన్నారు. 1998లో అప్పటి కలెక్టర్ ఎస్‌ఈ శేఖరబాబుకు కార్మికులు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను వివరించి పరిష్కారానికి చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన కుమార్తె, కుమారుడికి ఆదర్శ వివాహం చేశారని తెలిపారు. ప్రజా ఉద్యమాల్లో పాలుపంచుకోవడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. వీజీకే మూర్తి సంతాప సభ శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి శ్రీకాకుళంలో కత్తెర వీధిలో గల ఆయన ఇంటి వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు.

రిమ్స్‌కు శరీరదానం..

ఉదయం 9.30 గంటలకు ఆయన ఇంటి నుంచి రిమ్స్ వరకు ప్రదర్శన నిర్వహించి ఆయన పార్థివ దేహాన్ని రిమ్స్‌కు దానం చేయనున్నట్లు తెలిపారు. యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు, స్కీమ్ వర్కర్స్ అంతిమయాత్రలో పాల్గొనాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, అల్లు సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు. గురువారమే రెడ్‌క్రాస్ సాయంతో ఆయన నేత్రాలను విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు.

ప్రయాణం.. ప్రమాదం

అందరూ సంక్రాంతి సందడిలో మునిగి తేలుతుంటే హమాలీలు మాత్రం అదనపు కూలి కోసం కష్టపడుతున్నారు. ధాన్యం ఎత్తడానికి, దించడానికి గోదాంలతో పాటు ట్రాక్టర్లపై పనిచేసి నాలుగు పైసలు ఇంటికి తీసుకువెళ్లి పండగ ఖర్చులు గట్టెక్కిస్తున్నారు. అయితే భద్రత మరిచి ఇలా ప్రయాణం చేయడం తగదని చూసేవారన్నారు. - కాశీబుగ్గ



బంగారం చోరీ కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి గ్రామానికి చెందిన నాయన గోవింద ఫిర్యాదు మేరకు బంగారం చోరీ కేసును ఎచ్చెర్ల పోలీసులు గురువారం నమోదు చేశారు. గత ఏడాది తొమ్మిదో నెలలో 10 గ్రాముల బంగారం చైన్ అదృశ్యమైంది, గుర్తించటంలో జాప్యంతో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్కౌట్స్‌అండ్ గైడ్స్ యూనిట్ మంజూరు

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ మంజూరైనట్లు హెచ్‌ఎం ఎ.గోవిందరావు గురువారం తెలిపారు. స్కౌట్స్‌లో, గైడ్స్‌లో చెరో 32 మంది చొప్పున్న 64 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం చెప్పారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

ఆటోలు బోల్తా: 15 మందికి గాయాలు

సీతంపేట: ఆడలి వ్యూపాయింట్ ఘాట్ రోడ్‌లో రెండు ఆటోలు గురువారం సాయంత్రం వేర్వేరుగా బోల్తా పడిన సంఘటనలలో 15 మందికి గాయాలయ్యాయి. వారిలో పలు వురి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పాలకొండ మండలం వాటపాగు, బూర్జమండలం కురుంపేటలకు చెందిన గ్రామస్తులు ఆడలి వ్యూపాయింట్ చూడడానికి ఆటోల్లో వేర్వేరుగా వెళ్లారు. తిరిగి వస్తుండగా వెలంపేట మలుపు వద్దకు వచ్చేసరికి కురుంపేటకు చెందిన ఆటోను వెనుక వస్తున్న మరో ఆటో ఢీకొట్టడంతో లోయలో బోల్తాపడింది. పలువురికి గాయాలయ్యాయి. అక్కడే నిల్చుని ఉన్న వెల్లంగూడకు చెందిన గిరిజనుడైన సవర రెల్లయ్యపై ఆటో పడడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. కాగా వాటపాగు గ్రామానికి చెందిన మరో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఆ ఆటోలో ప్రయాణిస్తున్న వారికి కూడా గాయాలయ్యాయి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన రాజు

శ్రీకాకుళం రూరల్: ఈనెల 13న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం కిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందాడు. రూరల్ పోలీసులు ఇచ్చిన వివరాల మేరకు.. గార మండలం కొమరవానిపేట గ్రామానికి చెందిన మురముండ రాజు (25) శ్రీకాకుళం నగరం గోవిందనగర్ పెదపాడు రోడ్డు మీదుగా తన ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నగరంలోకి వస్తుండగా నరసన్నపేట నుంచి పెదపాడు మీదుగా వస్తున్న మహేంద్ర వాహనం బలంగా ఢీకొనడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ ఆయన బుధవారం రాత్రి మృతి చెందాడని రూరల్ పోలీసులు తెలిపారు.

వేటకు వెళ్లి.. విగత జీవిగా మారి



గడ్డెయ్య (ఫైల్)

గార: బందరువానిపేటలో ఓ మత్స్యకారుడు వేటకు వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం కుందు గడ్డెయ్య (41) గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వేటకు వెళుతున్న సమయంలో రాకాసి అలలు రావడంతో పడవ నుంచి సమీపంలో తుళ్లి సముద్రంలో పడిపోయాడు. వలలు కూడా తనపై పడటం, అందులోనే చిక్కుకోవడంతో ఊపిరాడక చనిపోయాడు. భార్య బోడెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ ఎం.చిరంజీవిరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు రిమ్స్‌కు తరలించారు. ప్రమాద ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ,



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మత్స్యశాఖ అధికారులతో వివరాలు తెలుసుకుని, వేట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వం మృతిని కుటుంబానికి అండగా ఉంటామని ఆ ప్రకటనలో తెలిపారు.

విశాఖలో చౌఖుపేట వాసి మృతి

సోంపేట: మండలంలోని బుసాబద్ర పంచాయతీ చౌఖుపేట గ్రామానికి చెందిన ఎం.రాజ్‌కుమార్ విశాఖ రైల్వేస్టేషన్‌లో గురువారం మృతి చెందినట్లు సోంపేట పోలీసులు తెలిపారు. రాజ్‌కుమార్ చౌఖుపేట గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్నాడు. భార్య రాజ్యలక్ష్మి విశాఖపట్నంలో నివాసం ఉంటోంది. పండగ సందర్భంగా రాజ్‌కుమార్ విశాఖ పట్నంలోని భార్యపిల్లల వద్దకు వెళ్లాడు. పండగ అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా రైల్వేస్టేషన్‌లో మృతి చెందాడు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతికి గల పూర్తివివరాలు తెలియాల్సి ఉంది. రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు విశాఖ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సోంపేట పోలీసులు తెలిపారు.



మృతి చెందిన రాజ్‌కుమార్

పార్టీని పటిష్టం చేద్దాం



తమ్మినేని సీతారాం నివాసంలో ధర్మాన కృష్ణదాస్ తదితరులు



బొడ్డేపల్లి రమేష్‌కుమార్‌తో ఆయన గృహంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్, తదితరులు

ఆమదాలవలస: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ గురువారం ఆమదాలవలస మండలం తొగరాంలో గల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ఇంటికి వచ్చి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంతో రాజకీయ అంశాలు చర్చించారు. అలాగే ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్ ఇంటికి కూడా వెళ్లి పలు అంశాలపై మాట్లాడారు. పార్టీని పటిష్టం చేసేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో భావనా మహర్షి జయంతి

టెక్కలి: పట్టుశాలిల ఆరాధ్య దైవం భావనా మహర్షి జయంతి కార్యక్రమాలను గురువారం స్థానిక అక్కపు వీధిలో ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భావనా మహర్షి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనతంరం నిరుపేదలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఇంజినీర్ పి.సింహాచలం, సంఘం అధ్యక్షుడు మల్లిపెద్ది మధుసూధనరావు, గౌరవ అధ్యక్షుడు దుంపా లోకేశం, సభ్యులు దుంపా శ్రీనివాస్, ఆట్ల పార్వతీశం, బస్వా శ్యామ్‌సుందర్, దుంపా మురళీమోహన్, వి.అశోక్, బుడ్డు నందికేష్, ఆట్ల విశ్వేశ్వ రావు, కె.రఘునాథరావు, డి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి అక్కపువీధిలో భావనామహర్షి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పట్టుశాలి సంక్షేమ సంఘం సభ్యులు

పూడుకుపోయిన కడపలవానిగెడ్డ



మండలంలోని దబ్బపాడు–తురకపేట గ్రామాల మధ్య ఉన్న కడపలవాని గెడ్డ ఆ రెండు గ్రామాల ప్రధాన రహదారి వద్ద పూడుకుపోయింది. గెడ్డపై రాకపోకలకు వీలుగా నిర్మించిన వంతెన లోతట్టుగా ఉండటంతో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డు మీద నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. వంతెన కింద నుంచి నీరు ప్రవహించేందుకు వీలు లేకుండా పూడుకు పోవటంతో నీరు నిలిచిపోతుందని రైతులు చెబుతున్నారు. ఎగువ ప్రాంతంలో ఉన్న పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గెడ్డలో పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట



అభినందన.. అవగాహన

పోలాకి పోలీసులు హెల్మెట్ ధారణపై వినూత్నంగా అవగాహన కల్పించారు. ఎస్‌ఐ రంజిత్ సమక్షంలో పిన్నింటిపేట, పోలాకి, ఈదులవలస, సంతలక్ష్మిపురం, బెలమర జంక్షన్ తదితర చోట్ల వాహన తనిఖీలు చేశారు. హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేస్తున్న వారికి షేక్‌హ్యాండ్ ఇచ్చి అభినందనలు తెలియజేసి.. మిగిలిన వారికి అవగాహన కల్పించారు. పండగ పూట ప్రమాదాలకు గురి కావద్దని విజ్ఞప్తి చేశారు.

– పోలాకి